# డాక్టర్ సుంటూరు శాస్త్రి

వాళ్ళ గుంటూర్లో చాలా పెద్ద డాక్టరు బాలసుబ్రమణ్యం దగ్గర కాంపౌండరుగా పని చేయడమే గాకండా ఆయన సొంత పన్లు శాస్త్రే చేసేవాడంట. అంతేగాకండా ఆపరేషన్ దియేటర్లో కూడా ఆయన పక్కనే ఉండేవాడంట.

ఏం తేడా వచ్చిందో ఏమో ఆ డాక్టరు దగ్గర మానేసి రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ సర్టిఫికెట్టు సంపాయించి చెల్లూరులో కొత్తగా కడ్తున్న సుగర్ ఫేక్టరీ డిస్పెన్సరీలో ఆరెంపీ డాక్టరుగా అపాయింటయిన శాస్త్రి అద్దెలు తక్కువని మకాం మాడూళ్ళో పెట్టాడు.

* * *

ఆరోజు సాయంత్రం ఈంద్రపేటలో లోవరాజు తన పెళ్ళాం మీద అనుమాన మొచ్చి కాలువగట్టు దగ్గరకెళ్ళి ఎండ్రిన్ తాగేసి తిరిగొస్తా



సుబ్బారాయుడు గుడిపక్కన కటికనేల మీద పడిపోయేడు. నోట్లోంచి నురగలొస్తున్నాయి. గుడ్లు తేలేస్తున్నాడు. ఇప్పుడో ఇంకాసేప్పున్నాకో పోయేలాగున్నాయి ప్రాణాలు.

చుట్టూ మూగిన జనాల్లో ఉన్న మిషను కుట్టు ఎంకారెడ్డిగారు "ఈడ్నిక రాంపురం గవర్నమెంటు హాస్పిటలుకి తీసుకెళ్ళికూడా దండుగే" అన్నాడు.

"ఎక్కిళ్ళు మొదలైనియ్యి. ప్రేణాలు మన కళ్ళ ముందునించే పోయేలాగున్నాయి" అన్నాడు కోరి గవర్రెడ్డి.

ఆటేపు నించెళ్తున్న మందుల అప్పన్న కూడా అదే మాటన్నాడు.

మూగిన జనం నెమ్మదిగా పల్చబడ్తున్న టైములో ఫ్యాక్టరీలో డ్యూటీ చేసి వస్తున్న శాస్త్రి లోవరాజు దగ్గరకెళ్ళి అతని పరిస్థితి చూసేకా పాలవ్యాపారం చేసే అమ్మిరెడ్డిగారి అరుగుమీద కూర్చోబెట్టి మూడుశేర్లనీళ్ళు తాగించేస్తున్నాడు.


గబగబా శాస్త్రి దగ్గరకెళ్ళిన ఎంకారెడ్డిగారు ''ఇదిగో ఏవండి డాక్టరుగారూ..ఆడెలాగా బతకడు అది తెలిసి బొక్కలో పడకండి పెద్దోళ్ళం చెపుతున్నాం'' అన్నాడు.

అతని మాటలు వింటానే ఆ లోవరాజుకి నీళ్ళు పట్టించే పనిలోనే ఉన్నాడు.

''మా మాట వినండి ఆనకా పోలీసులొస్తే అరష్టయిపోయి ఆళ్ళకూడా ఎళ్ళాలి మీరు'' అన్నాడు గవర్రెడ్డిగారు.

శాస్త్రి నీళ్ళు బాగా తాగించడంతో లోవరాజు పొట్టంతా ఉబ్బెత్తుగా లేచింది.

కాసేపటికి పంట్లాంలోంచే మూత్రం వెళ్ళిపోయింది. కాస్సేపయ్యాకా ఇంకో శేరున్నర నీళ్ళు పట్టించేసరికి పెద్ద పెద్ద వాంతులు చేసేసుకున్నాడు. అరుగంతా ఎండ్రినువాసన.



మగతగా పడుకున్న లోవరాజు బాగా చీకటి పడ్డాకా నీరసంగా లేచి శాస్త్రి ఇంటికొచ్చి దణ్ణం పెట్టి చిన్నం నాగన్న జట్కాబండిలో వాళ్ళ ఈంద్రపేట వెళ్ళిపోయేడు.

దాంతో, ప్రేణాలు పోయినోడ్ని బతికించేడన్న పేరొచ్చింది శాస్త్రికి.

ఊరు ఊరంతా ఒకటే చెప్పుకోడం ఎక్కడికెళ్ళినా శాస్త్రి గురించే.

"మేం వద్దురా రంకుమొగుడా అంటన్నా విన్లేదా డాక్టరు. వైజ్జిగం కంటే ముందు ఆ మనిషి ధైర్యానికి మెచ్చుకోవాలి" అన్నాడు గవర్రెడ్డిగారు.

"ఇలాంటి మనిషి ఊరికొకడన్నా ఉండాలి" అన్నారు మిల్లు సత్తిరాజుగారు.

ఎంకారెడ్డిగారి ఇంటి మీద పడుకునే రాజుల సుబ్బమ్మగారికి వల్లంతా దురదతో నిద్రపట్టక రాత్రంతా గోక్కుంటే తెల్లారే సరికి రెండు దోసిళ్ళ పొట్టు వస్తుంది ఒంటిమీంచి.

శాస్త్రి దగ్గరకొచ్చి ఇదంతా చెప్పింది సుబ్బమ్మ.

సోరియాసిస్సంటారు దీన్ని నెలరోజుల పాటు అన్నంలో ఉప్పు మానెయ్యమన్నాడు.

నెలేంటి ఆరునెల్లు మానేసింది. దాంతో సుబ్బమ్మగారు శరీరంలో దురద మటు మాయమైపోయింది.

"బాబూ ఈ జన్మకి తగ్గదనుకున్న మాయరోగం ఇట్టే తగ్గించేవు...ఎంతిచ్చుకోమంటావ్ నాయనా?" కళ్ళనీళ్లతో అడిగింది సుబ్బమ్మగారు.

నవ్వేసిన శాస్త్రి "మీరు వంటలు బాగా చేస్తారంట గదా పాకుండలు వండి పట్రండి చాలు.. నేనెవరి దగ్గరా ఫీజు తీసుకోనమ్మా మా చెల్లూరు ఫేక్టరీ వాళ్ళు నాకిస్తున్న జీతం చాలు" అన్నాడు.

దేవాంగులపేటలో వుట్ల నాగన్నగారి నాలుగో అమ్మాయికి ఎడం దవడ కింద మూడు సురుపుడి కాయలు లేచాయి. ముందు ఒకటే ఉండేది. ఎవరో చెప్పేరని తమలపాకు తొడిమలో సున్నం పెట్టేసరికి ఆ ఒకదాన్లోంచి మూడు పుట్టుకొచ్చినియ్యి గుర్రపు వెంట్రుకతో గట్టిగా ముడేస్తే ఊడిపోతాయంటే అదీ చేసేరు పుండు పడింది తప్ప కాయలు ఊడలేదు.

ఆ విషయం తెల్సుకున్న శాస్త్రి వాళ్ళింటికి తీసుకెళ్ళి బల్లమీద పడుకోబెట్టి ఆపరేషన్ చేసి మూడుకాయల్ని తీసేసేడు.

ఫీజెంత అని అడిగితే "మీ అమ్మాయి పెళ్ళికి పిలవండి అదే ఫీజు" అని నవ్వేసేడు.

కోరి శేషారెడ్డిగారింట్లో ఆడపడుచుకు అర్ధరాత్రి కాన్పు కష్టమయ్యింది కడుపులో బిడ్డ అడ్డం తిరిగింది. ఆ రాత్రి తుఫాను. రాంపురం వెళ్ళడానికి రిక్షాలు కూడా లేవు. తీరా అక్కడికెళ్ళేదాకా బిడ్డ బతుకుద్దో లేదో అని భయపడ్తుండగా శాస్త్రి గుర్తుకొచ్చేడు.

వెళ్ళి బతిమలాడితే "చిన్నచిన్న ఆపరేషన్లవీ చెయ్యగలను కానీ రూలు ప్రకారం చెయ్యకూడదు నేను ఎం.బీ.బీ.యస్.ని కాదండీ" అన్నాడు.

కోరిశేషయ్యగారి కొడుకులంతా ఒకటయ్యి "ఏవన్నా వస్తే మేం జూసుకుంటాం. ఎక్కడ సంతకాలూ, వేలిముద్రలూ వెయ్యాలో చెప్పండి వేస్తాం" అన్నారు.

ఆపరేషను చేసేసేడు శాస్త్రి.

తల్లీ బిడ్డా క్షేమం.

అతనికి దణ్ణాలు పెట్టి ఫీజు ఎంతంటే ''మీ ఆశీస్సులే నాకు ఫీజు'' అని తిరిగి దణ్ణం పెట్టేసేడు.

* * *

కొత్త ర్యాలీ సైకిలు కొనుక్కుని మందులున్న తోలు సంచీ హేండిలుకి తగిలించుకుని తూర్పుపేట, ఈంద్రపేట, చింతాలమ్మగుడి వెనకున్న ఊటలంకవీధి, తురకల వీధి, భోగం వాళ్ళ వీధి, కర్రోరి వీధి, బ్రహ్మాయ్యగారి వీధి ఇలా తిరుగుతూ అర్ధణా పుచ్చుకోకండా వైద్యం చేస్తున్నాడు శాస్త్రి.

ఆ సాయంత్రం. గాలి చల్లగా వీస్తుంది.

మేతకెళ్ళిన పశువుల్ని ఊళ్ళోకి తోలుకెళ్తున్నారు కుర్రోళ్ళు.

అర్తమూరులో పల్లకీ ఎక్కిన సోమిరెడ్డిగారికోడల్ని ''ఒహోం ఒహోం హోం'' అని అరుస్తా మోసుకొస్తున్నారు బోయీలు.

పంచాయితీ బోర్డు రాటకి కట్టిన స్పీకర్‌లోంచి వార్తలొస్తున్నాయి.

ఆఫీసు అరుగుమీద ప్రెసిడెంటు కర్రి మందారెడ్డిగారితో పాటు ఊళ్ళో పెద్దలంతా కూర్చున్నారు.

''ఈ వేళ మన వూళ్ళో కాపురం ఉంటున్న ఆ గుంటూరు శాస్త్రి గారి గురించి మాటాడదాం అనుకుంటున్నాం'' అన్నాడు లచ్చారెడ్డిగారు.

''మా వెంకయ్య చాలా గొప్పగా చెపుతున్నాడు అతని గురించి'' అన్నాడు మందారెడ్డిగారు.

''అవును అతను చాలా గొప్పోడు. అతను మనూళ్ళో ఉండటం ఊరోళ్ళు చేసుకున్న అదృష్టం అనుకోవాలి. అద్దీగిద్దీ ఏం వద్దూ మా వూరొచ్చేసి మా ఇంట్లో ఉండండి అని కబురు చేస్తున్నారట చెల్లూరు కమ్మోరు. అతనికేదన్నా చేసి మనూళ్ళోనే ఉంచేసుకుందాం అని మేమంతా అనుకుంటున్నాం'' అన్నాడు చింతా రామకృష్ణారెడ్డిగారు.

''అయితే ఏం చేద్దామంటారు?'' అడిగేడు మందారెడ్డి.

''ఊరికే అతనికో చిన్న హాస్పిటలు లాంటిది కట్టిచ్చేమనుకోండి ఈ జన్మకి మనూర్నుంచి కదలడు ఏవంటారు?'' అన్నాడు లచ్చారెడ్డి.

''బాగుంది వెంటనే మొదలెట్టేద్దాం'' అన్నాడు మందారెడ్డిగారు.

ఈ చర్చ జరిగిన నాలుగురోజుల తర్వాత మంచిరోజు చూసి స్కూలు బిల్డింగ్‌ని ఆన్చి ఉన్న ఖాళీ దొడ్డిలో పునాదులు తవ్వించి మూడు వందల చదరపు అడుగుల ఇల్లు కట్టించేశాక ఒక సాయంత్రం శాస్త్రిని పిల్చి ''ఈ ఇంటి ముందు మీరు హాస్పిటలు పెట్టుకోండి వెనకాల కాపురం ఉండండి ఇది మీకు మా ఊరి కానుక'' అన్నారు.

వాళ్ళ ఆదరానికి పొంగిపోయిన శాస్త్రి కళ్ళమ్మట నీళ్ళతో వాళ్ళందరి కాళ్ళమీదా పడిపోయేడు.

తనొచ్చి మూడ్నెల్లు కూడా కాలేదు. ఇంత తక్కువ టైములో అంత గొప్ప ఎదుగుదలకి తనకే విడ్డూరంగా ఉంది. పరమానంద పడిపోయేడు శాస్త్రి.

* * *

కొత్త ఇంట్లో గృహప్రవేశంతో పాటు సత్యనారాయణమూర్తి వ్రతం పెట్టుకున్న శాస్త్రి అందరిళ్ళకీ వెళ్ళి పేరు పేరునా పిలిచి ''భోజనం చెయ్యకండా వెళ్తే మట్టుకు నా మీద ఒట్టే'' అన్నాడు.

ఊరి వాళ్ళు కట్టించి ఇచ్చిన ఇంటి ముందు పెద్ద పందిరి వేయించాడు. బాజా బజింత్రీలూ ముఖ్యంగా కుమ్మరి కోటయ్య డోలు వాయిద్యం పెట్టించాడు. వంటలూ అవీ పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేడు.

ఆరోజు గృహప్రవేశం. ఊరు ఊరంతా కదిలి వచ్చింది.

శాస్త్రి దంపతులు సత్యన్నారాయణ మూర్తి వ్రతంలో కూర్చుంటే ఇక చదివింపుల వాళ్ళు హోరెత్తించేస్తుంటే అందరిపేర్లూ పద్దుల పుస్తకంలో రాసుకుంటున్నాడు శాస్త్రి బావమర్ది.

ఆరాత్రి, వచ్చిన చదివింపులు పరుపు మీద పోసి ఎదురుగా భార్యని కూర్చో బెట్టుకుని లెక్కగడితే చాలా తేలింది.

''పేషెంట్ల దగ్గర ఫీజు ఎందుకు పుచ్చుకోవడం మానేసేనో తెలుసా వాసంతీ?'' అనడిగాడు భార్యని.

''ఎందుకు?'' అందామె.

''ఇలా సత్యన్నారాయణ మూర్తి వ్రతం పెడదామని'' అన్నాడు.

''అర్థం కావడం లేదు'' అందామె.

''సింపుల్‌గా చెపుతాను విను...ఈ మూడు నెలలుగా పేషెంట్ల దగ్గర అయిదూ పదీ ఫీజూ తీసుకుంటే ఇలా చదివింపులు వచ్చేవికాదు. అలా వ్రతం పెడదామని ముందే తెలియడం వల్లే ఫీజులు తీసుకోడం మానేశాను...'' అని వివరంగా చెప్పాడు.

ఇది గడిచిన మరో మూడు నెలలకి గుంటూర్లో పనీ పాట లేకండా తిరుగుతున్న బామ్మరిదిని పిల్చి డిస్పెన్సరీ ఉండే చోటులో అడ్డంగా గోడ కట్టి, ముందుపక్క గుమ్మం పెట్టించి అందులో మందులషాపు పెట్టించాడు.

ఇక్కడ్నించి అతను రాసిన ఖరీదైన మందులకి రామచంద్రపురం వెళ్ళకండా తన మెడికల్ షాపులోనే కొనడం మొదలెట్టారు.

జనం దృష్టిలో డాక్టరుగారు పైసా ఫీజు తీసుకోని పరమాత్ముడు అన్నపేరు సంపాయించుకున్న శాస్త్రి ఫీజులకంటే చదవింపులే ఎక్కువ వస్తున్నాయి గాబట్టి ఆరు నెలలకోసారి వ్రతం పెట్టుకుంటున్నాడు. అటు పక్క చూస్తే మాంచి సేల్స్‌తో మెడికల్ షాపు.

ఎంత అమాయకులూ మా పల్లెటూరి జనం???

* * *